# ఈ కథకి ముగింపు వుంది

**కేతవరపు వెంకట రమణమూర్తి**

రాత్రి ఒంటిగంట దాటుతోంది.

గుడ్డి బల్బు కాంతి, వరండాలో బెంచి మీద కూచున్న ఆమె మొహం మీద పడుతోంది. ఆమె వంక పరీక్షగా చూశాను. సన్నగా, చామన ఛాయలో ఆకర్షణీయంగా వుంది. వయసు ముప్పైలోపే వుంటాయి. కోల మొహం, పెద్ద పెద్ద కళ్ళు. నుదుటిమీద పడుతున్న జుట్టుని వెనక్కి తోసుకుంటూ నావంక చూసింది. ప్రపంచంలోని దైన్యమంతా ఆ కళ్ళల్లోనే కాపురమున్నట్టు అనిపించింది. ఆమె కూర్చున్న బెంచీ పక్కనే చీప్ సూట్‌కేసు. ఆమె సామాన్లు గావాల్సు. చెయ్యి కదిలినప్పుడు 'గలగల' మంటున్న వెలిసిపోయిన మట్టి గాజులు. తల్లో మల్లెచెండు భుజాల మీదికి వేలాడుతూ.

మామూలు కథే. రొటీన్ రైడింగ్‌లో లాడ్జిలో పట్టుబడింది. ఆమెతో వున్న విటుడు కిటికీలోంచి దూకి పారిపోయాడు. ఆమెని లాక్కొచ్చి ఇక్కడ కూర్చోబెట్టాడు హెడ్ రాందాసు. రేపొద్దున్న కోర్టుకి తీసుకెళ్ళేదాకా లాకప్‌లో వేయాలా? లేకపోతే ఆ బల్లమీదే కూర్చోబెట్టాలా? ఆలోచన ఎంతకీ తెగట్లేదు నాకు. ఎస్.ఐ.గా చేరి మూడునెల్లే అయింది నేను. ఆకర్షణీయంగా వున్న ఆమె వంక చూసి హెడ్ రాందాసు, కానిస్టేబుల్ సింహాచలం అప్పుడే పెదాలు తడుపుకుంటున్నారు నాలుకతో. శవాల మీద పైసలు ఏరుకునేవాళ్ళు. అసహ్యం వేసింది.

"ఇట్టా రా!" నా గొంతులో ధ్వనించిన అధికారానికి నాకే కోపం వచ్చింది నామీద. మెల్లగా నడిచొచ్చింది.

"కూర్చో" ఎదురుగా వున్న కుర్చీని చూపిస్తూ ఈసారి నిదానంగా అన్నాను. వెంటనే కూర్చుంది నిలబడలేనట్టు.

ఫ్లాస్క్‌లో కాఫీని ఒంచి ఆమెకిచ్చాను, నేను ఓ కప్పు తీసుకుంటూ. సందేహించకుండా తీసుకుని తాగేసింది. ఎంత ఆకలిగా వుందో మరి. ఏదో చెప్పాలన్నట్టు గొంతు సరిచేసుకుని ఆగిపోయింది. భయం వల్లో, చెప్పి ఉపయోగం వుండదనుకునో! నేను ముందుకి ఒంగి "ఏదో చెప్పాలనుకుంటున్నట్టున్నావ్— ఫర్వాలేదు చెప్పు" అన్నాను. తెల్లారడానికింకా టైముంది. కనీసం కొంతసేపయినా పనిలేనితనాన్ని మర్చిపోవచ్చు ఆమె కథ వింటూ. ఆమె గొంతు సవరించుకుని చెప్పడం మొదలుపెట్టింది.

ఆమె చెప్పిన కథ:

నేను కూడా అందరి ఆడపిల్లల్లా బతకాలనుకోవడం దురాశా? తప్పా? ఆ బాపనపిల్ల సుగుణ, రెడ్డిగారమ్మాయి చరిత, ఎందరో ఇంకెందరో భర్తల స్కూటర్ల మీద హాయిగా సాయంకాలాల పూట సినిమాలకో, షికార్లకో, పేరంటాలకో, స్నేహితురాళ్ళకో వెళ్తుంటే, నేను.. నేను మాత్రం ఈ గుమ్మం వెనకాల క్రీనీడల్లో, విటుల కోసం ఎదురుచూడాల్సి రావడం, నేను ఏ జన్మలో చేసుకున్న పాపం అయియుంటుంది? నిజంగా భగవంతుడనే వాడుంటే నన్ను వ్యభిచారిగా బతకమని, రోగాలతో, రొష్టులతో కుళ్ళి పొమ్మనీ నా జాతకంలో రాస్తాడా? ఎందుకిలా జరిగింది? ఎవరి తప్పిది?

మా అమ్మ వేశ్యగా బతికింది. మా అమ్మమ్మ కూడా వేశ్యే. నన్నూ అదే వృత్తిలోకి దింపింది నేను వద్దంటున్నా. డిగ్రీ పూర్తయ్యేవరకు అలారు ముద్దుగా పెంచిన మా అమ్మ, నన్నేలా ఈ వృత్తిలోకి దింపగలిగిందో నాకర్థం కాలేదు. అదే ప్రశ్నని వేస్తే మా అమ్మ నవ్వి "మా కాలంలో కండపుష్టి వుండి కళగా వుంటేనరి డబ్బులు రాలేవి. కానీ సినిమాలు, టీవీ ఉధృతమైన ఈ రోజుల్లో చదువుకున్న అమ్మాయిలంటే కుర్రకారుకి మోజెక్కువ. ఇంగ్లీషు మాట్లాడే పిల్లకి రేటెక్కువ పలుకుతుంది. చప్పున డబ్బులు దండుకో వచ్చు రోగాలు మనల్ని మింగేయక ముందే" నా తల్లైనా ఎంత నిర్దయగా సునాయాసంగా చెప్పిందీ?

బహుశా మా అక్కల్లాగా, నేను కూడా అయిదో, ఆరో క్లాసుల దాకానే చదువుకుంటే, ఈ ఆలోచించడం, పోల్చుకోవడం, ప్రశ్నలేయడం వుండేది కాదేమో! ఆలోచనలు బహుచెడ్డవి. యాసిడ్ పడితే శరీరం కాలిపోయినట్టు, ఆలోచించడం వల్ల మనసు కాలిపోతుంది. ఆ గాయాలకి మందుంటే, ఈ గాయాలకి మందు లేదు. అదే తేడా.

మా అమ్మకి జాతకాల పిచ్చెక్కువ. దేవుడూ, భక్తీ, మడీ, ఆచారం అన్నీ పాటిస్తుంది. నాకు ఇంత విషాదంలోను మా అమ్మని చూస్తే జాలీ, విచారం కలుగుతాయి. పరంపరగా ఈ వృత్తే చేయమని రాసేసి వుంటాడు ఆ దేవుడు మా జాతకాల్లో, అసలు దేవుడనే వాడుంటే.

నా జాతకంలో ఏడు గ్రహాలు 'ఉచ్చ'ట. అందుకే నాకు చదువు, తెలివి పుష్కలంగా అబ్బాయిట. తరచు నా దగ్గరకు వచ్చే సిద్ధాంతిగారు చెప్పారొకసారి నాతో. కానీ శుక్రుడిలో రాహువో, శనో మారడం వల్ల నేను ఈ వృత్తే చేయాల్ట! దానిని రాసిన బ్రహ్మవల్ల కూడా కాదుట మార్చడం. నేనప్పుడు ఏడ్చాను. 'ఏదైనా గ్రహాలకి శాంతి చేయిస్తే ఈ నరకం నాకు తప్పుతుందేమో' చూడమన్నాను ఆయన్ని.

దానికాయన నవ్వి "పిచ్చిదానా చదువుకున్నావు సరే. దానికి తగ్గ ఉద్యోగం వచ్చిందే అనుకో. అక్కడ నీ గతం తెలిసినవాడు నిన్ను బతకనిస్తాడా? అయినా ఒక్క రాత్రికి అయిదు వందలు. నెలకి కనీసం పది పదిహేను వేలు సంపాదించొచ్చు. ఉద్యోగంలో ఏం డబ్బుందీ! ముష్టి మూడువేలు పగలల్లా చాకిరీ చేస్తే. ఈ చీరలు, సెంట్లు, తిండి ఆ డబ్బుతో అనుభవించగలవా. అయినా అదృష్టం అంటే నీదేనే. రోజుకో కొత్త మొగాడు, ఓ కొత్త సుఖం. ఇవన్నీ పెళ్ళి చేసుకుంటే దొరుకుతాయా?"

నాకు రెట్టింపు వయసున్నాయన అలా అని నిరగబడి నవ్వుతుంటే నాకు భరించలేని దుఃఖం తన్నుకొచ్చింది. ఆడదాన్ని ఆదిశక్తన్నారు. ఆదిశక్తి కన్నీటికే విలువుంటే నా కన్నీళ్ళు ఈ లోకాన్నే ముంచేవి కదూ! ఇదా జీవితం. కాదు... ముమ్మాటికీ కానే కాదు. అప్పుడే నిర్ణయించుకున్నాను ఎట్లాగైనా ఇక్కణ్ణించి తప్పించుకోవాలని.

బహుశా ఆ సిద్ధాంతిగారు వెళ్తూ వెళ్తూ ఈ విషయం అమ్మ చెవిన వేసినట్టున్నారు. అమ్మ పరుగెత్తుకొచ్చి "ఈ సర్టిఫికెట్లు, ఈ మెడల్సు చూసుకునే కదే నీకు ధైర్యం వచ్చింది? ఉద్యోగం చేస్తుందట ఉద్యోగం" అంటూ నా కళ్ళముందే, నన్ను తొమ్మిది నెలలు మోసి, గోరుముద్దులతో పెంచిన నా తల్లే, సాటి ఆడది, నా స్వప్నాల్ని తగలబెట్టేసింది.

